

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## జ్ఞానవల్లి

**కాఫీ వాసనకి మెలుకువ** వచ్చిన హరి టైం చూసుకుని లేచి గబగబ మొహం కడుక్కుని వంటింట్లోకి వెళ్ళాడు. ఓ స్టవ్ మీద ఇడ్లీ కుక్కర్లోంచి ఆవిర్లు వస్తూంటే, మరో స్టవ్ మీది కుక్కర్ రెండు విజిల్స్ వేసింది. మూడో స్టవ్ మీద సాంబార్ మరుగుతోంది. నాలుగోదాని మీద పాలు కాగుతున్నాయి.

శ్రీవల్లి మిక్సీలో ఇడ్లీలోకి వేరుశనగపప్పు పచ్చడి చేస్తోంది. పక్కన ఎలక్ట్రిక్ కాఫీ మేకర్లోంచి కెటిల్లోకి డికాషన్ దిగుతోంది.

"వావ్! శ్రీవల్లీ, నా కల్పవల్లీ! ఏమిటిదంతా? ఏడున్నరకే వంటిల్లంతా ఇలా రణరంగంలా ఉందేమిటి?"

వెనక నించి ఆమెని కౌగలించుకుంటూ అడిగాడు.

"ఎనిమిదికల్లా ఆఫీస్‌కి బయలుదేరాలి అని చెప్పారుగా రాత్రి?" మిక్సీ ఆపి, మూత తీసి స్పూన్‌తో పచ్చడిని కొంచెం తీసి రుచి చూసి కొద్ది ఉప్పేసి మళ్ళీ ఓసారి ఆన్ చేసింది.

"నిజమే కానీ బ్రేక్ ఫాస్ట్ చాలుగా. పొద్దున్నే కేరేజ్ ఇవ్వడం కష్టంకదా ఏదో ఒకటి తినేస్తావే కేంటిన్‌లో" కొత్త భార్యని మురిపెంగా చూస్తూ చెప్పాడు.

"పర్లేదు ఇంటి దగ్గర ఏడింటికి లేచేదాన్ని ఇప్పుడు ఆరింటికి లేస్తే పనులు అయిపోతాయి. మీరు వెళ్ళాక ఇల్లు క్లీన్ చేసి బట్టలు ఉతికేస్తే ఈపూట పనైపోతుంది" పచ్చడిని గిన్నెలోకి తీస్తూ చెప్పింది.

"పనయ్యాక పక్క ఫ్లాట్ ఆవిడ్ని పనిపిల్ల గురించి అడుగు. అన్నీ నువ్వు చేయాలంటే కష్టంకదా? కాఫీ ఇస్తే స్నానానికి వెళ్తా" చెప్పాడు.

"పనిమనిషి వద్దులెండి. ఇద్దరమేగా పదకొండు గంటలనించి ఖాళీగానే ఉంటాను కదా!" కాఫీ కప్ అందిస్తూ చెప్పింది.

"సరే నీ ఇష్టం" ఫోన్‌లో మెసేజ్‌లు చూస్తూ ఆ విషయం పట్టించుకోలేదు హరి.

మధ్యాహ్నం లంచ్‌కి లేచి కేంటీన్‌కి వెళ్ళబోయి శ్రీవల్లి ఇచ్చిన లంచ్ బేగ్ తెరిచి చూసాడు. ముద్దుగా ఉన్న మూడు గిన్నెల కేరేజ్. ఒక దాని నిండా అన్నం ఉంది. ఒక గిన్నెలో వంకాయకూర మరో దాంట్లో సాంబార్. ఒక చిన్న పెరుగు కప్పు. ఒక చిట్టి భరిణలో పచ్చడి, స్పూన్.

వెంటనే శ్రీవల్లికి ఫోన్ చేసి చెప్పాడు.

"శ్రీవల్లీ నా పాలవెల్లి ఎంత బాగా సర్దావో. చూస్తేనే ఆకలేస్తోంది. థాంకుయూ"

"భలేవారే నాకు థాంక్సేమిటి? మిగలకుండా తినండి" చెప్పింది.

ఫోన్ పెట్టేసి ఈనాడు డాట్ నెట్‌లో వార్తలు చదువుతూ తినసాగాడు.

"శ్రీవల్లీ నా నాగమల్లీ ఒక చిన్న రిక్వెస్ట్."

"ఏమిటి అది?" ఆరిన బట్టలు మడతేస్తూ అడిగింది.

"నువ్వు రోజూ నాకు కేరేజ్ ఇస్తున్నావా? వాటి ఘుమఘుమలకి మా ఫ్రెండ్స్ ముగ్ధులైపోయి ఒకటే గొడవ. మీ ఇంటికి భోజనానికి పిలవచ్చుగా అని."

"అందులో ఏముంది? పిలవండి."

"ఆల్‌రెడీ పిలిచేసా. రేపు శనివారం కదా. వచ్చేయమన్నా. ముగ్గురు అహ. మూడు జంటలు. ఆరుగురు ప్లస్ మనం. ఎనిమిది మందికి వంట చేయగలవా?"

"పిల్లల్లేరా ఎవరికీ?" వెటకారంగా అడిగింది.

"నీ అదృష్టం. లేరు" నవ్వాడు.

"సాయంత్రంపూట పిలిచి ఉంటే బావుండేది. ఆరింటికే లేవలేకపోతున్నా అంతమందికి వంట అంటే ఐదుకే లేవాలేమో."

హరి ఆనందంతో ముఖం విప్పార్చి చెప్పాడు.

"రాత్రికే పిలిచా. ఒక చిన్న మందు పార్టీ. సండే నీ ఇష్టం వచ్చినంతసేపు పడుకోవచ్చు. సరేనా?"

"సరే. సాయంత్రం నాలుగ్గంటల నించి పని ప్రారంభిస్తే సరిపోతుంది." మనసులో లెక్కలు వేసుకుని చెప్పింది.

"శ్రీవల్లీ నా ముంగిట రంగవల్లీ మన పార్టీ గ్రాండ్ సక్సెస్. నీ వంటలకి మా మిత్రబృందం ఎంత అసూయ పడ్డారో వాళ్ళావిడలు వినకుండా 'లక్కీఫెలో' విరా అన్నారు." సంతోషంగా చెప్పాడు హరి.

చిందరవందరగా మారిన ఇంటిని చూసి నిట్టూర్చింది శ్రీవల్లి.

హుషారుగా ఈల వేసుకుంటూ తలుపు తీసి లోపలకి వచ్చిన హరి అక్కడే ఆగిపోయాడు ఎదురుగా చేట, చీపురు పడేసి ఉన్నాయి. సోఫాలు గది మధ్యకి లాగి ఉన్నాయి. అక్కడిదాకా ఊడ్చుకు వచ్చిన చెత్త చెల్లాచెదురుగా ఉంది. ఎప్పుడూ అద్దంలా ఉండే ఇల్లు అలా ఉండటంతో చిరాగ్గా పిలిచాడు.

"శ్రీవల్లీ"

బదులు రాకపోవడంతో వంటింట్లోకి వెళ్ళాడు. అక్కడా లేదు. బెడ్‌రూంలో పడుకుని నిద్రపోతున్న ఆమెని చూసి కంగారుగా లేపి అడిగాడు.

"ఏమైంది? జ్వరమా?"

"కాదు. టివి కింద వంగి ఊడుస్తూంటే నడుం పట్టేసింది. లేవలేకపోతున్నా. అతి కష్టం మీద పాకుతూ వచ్చి మంచం మీద పడుకున్నా."

కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా చెప్పింది.

"పనిమనిషిని పెట్టుకో అంటే విన్నావా? ఇప్పుడు చూడు అడ్డం పడ్డావ్." కోపంగా చెప్పాడు.

"దాహంగా ఉంది కొంచెం మంచినీళ్ళు ఇవ్వండి" నీరసంగా చెప్పింది. ఫ్రిజ్‌లోంచి ఒక బాటిల్ తెచ్చి ఆమెకిచ్చి చెప్పాడు.

"ఈ సేవలు నేను చేయలేను. నాకు ఆకలిగా ఉంది. ఇవాళ టిఫినేం లేదుగా?"

"నేను పొద్దుట్నించీ ఏమీ తినలేదు. పనయ్యాక స్నానం చేసి తింటా కదా. ఇంతలో ఇలా అయింది. పొద్దున కాఫీ తాగా అంతే."

"నేను బయటకి వెళ్ళి ఏదో ఒకటి తిని వస్తా."

"నాకు నడుం నొప్పికి ఏమైనా టాబ్లెట్లు తెండి." నీరసంగా చెప్పింది.

"పేరు చెప్పు" విసుగ్గా అడిగాడు.

"నాకు ఇలా రావడం ఇదే మొదటిసారి, మెడికల్ షాప్‌లో అడిగితే ఇస్తారు."

విసురుగా వెళ్ళిపోయాడు. గంట తర్వాత మగతగా పడుకున్న శ్రీవల్లికి మసాలా వాసనకి మెలుకువ వచ్చింది.

టి.వి పెట్టుకుని, హోటల్‌నించి తెచ్చుకున్న పార్సిల్ తినేసాక హరి మంచినీళ్ళు తాగి, ఆమె దగ్గరకి వచ్చి జేబులోంచి మందుబిళ్ళల స్ట్రిప్ తీసిచ్చి చెప్పాడు.

"పొద్దున, రాత్రి రోజుకి రెండు చొప్పున ఐదురోజులు వేసుకోమన్నాడు"

"ఖాళీ కడుపుతో వేసుకోవచ్చో లేదో కనీసం బ్రెడ్ అయినా తేవాల్సింది."

"నువ్వు చెప్పచ్చుగా? నాకేం తెలుసు నాకు రోగాలన్నా, రోగిష్టివాళ్ళన్నా అసహ్యం" చిరాగ్గా చెప్పాడు.

"పోనీ పొద్దుటి ఇడ్లీలు టేబుల్ మీద హాట్‌పేక్‌లో ఉంటాయ్ ఇస్తారా? చాలా ఆకలిగా ఉంది" దుఃఖంగా చెప్పింది.

వెళ్ళి బాక్స్ తెచ్చి ఆమె పక్కన పెట్టి చెప్పాడు.

"నేను గెస్ట్ బెడ్‌రూంలో పడుకుంటా. నువ్వు స్నానం చేయలేదుగా. చెమట వాసన వస్తుంటే నిద్రపట్టదు. మళ్ళీ రేపు ఆఫీస్‌లో బోలెడు పని గుడ్‌నైట్."

అతికష్టం మీద పక్కకి తిరిగి హాట్ పేక్ మూత తెరిచింది. చల్లారిన రెండు ఇడ్లీలని, పచ్చడి అడిగితే అతను ఎక్కడ విసుక్కుంటాడో అని నెమ్మదిగా నమిలి మింగి మంచినీళ్ళు తాగి మందుబిళ్ళ వేసుకుని పడుకుంది.

ఉదయం కాఫీ వాసనకి హరికి మెలుకువ వచ్చింది. గబగబ మొహం కడుక్కుని వంటగదిలోకి వచ్చాడు.

ఓ స్టవ్ మీది కుక్కర్ రెండు విజిల్స్ వేసింది. మరో స్టవ్ మీద టొమేటో పప్పు ఉడుకుతూంటే, ఇంకో స్టవ్ మీద బంగాళాదుంపలు వేగుతున్నాయి. నాలుగవ స్టవ్ మీద శ్రీవల్లి దోసెలు వేస్తోంది.

"శ్రీవల్లీ. నా అనురాగవల్లీ నువ్వివ్వాళ లేస్తావనుకోలేదు. కాఫీ ఇస్తే స్నానం చేసి వస్తా రాత్రి బావర్చీ బిర్యానీ అస్సలు బాలేదు. ఆకలి." ఆమెని వెనకనించి కౌగలించుకుని చెప్పాడు.

"స్నానం చేయకుండా నన్ను ముట్టుకోకండి" మృదువుగా విదిలించుకుంది.

"ఇదెప్పటినుంచి?" తెల్లబోయాడు.

"జ్ఞానోదయాలు అవుతూ ఉంటేనే మనిషి ఎదుగుతాడు" చెప్పింది.

"నువ్వంటున్నది ఏమిటో నాకు అర్ధంకాలేదు కానీ కాఫీ ఇవ్వు" చెప్పాడు.

లంచ్ బాక్స్ అందిస్తూ చెప్పింది.

"ఆరింటికి లేస్తూంటే నిద్రచాలడం లేదు. అందుకని బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్ చేస్తాగాని రేపటినుంచి లంచ్ ఇవ్వలేనేమో."

"అదేంటి?" అదిరిపడ్డాడు.

"పొద్దున పక్కింటావిడ పనిపిల్ల గురించి అడిగాను వాళ్ళ పనిమనిషే చేస్తుందిట. నెలకి రెండువేలు జీతం. ఇవాల్టినించే రమ్మన్నాను."

"పనిలేకపోతే తోచదన్నావుగా?"

"అవును. కానీ పనితో ఒళ్ళు హూనం చేసుకుంటే కష్టం కదా. నా సంగతీ చూసుకోవాలిగా. అద్దం పడితే చూసే దిక్కులేదని అర్ధమైంది. మరి కళ్ళు తెరవాలిగా?" నవ్వింది.

అతను ఏమీ మాట్లాడలేదు.

" గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకావిడ సంగీతం నేర్పిస్తారట. కాలక్షేపం కోసం చేరదామనుకుంటున్నాను. నెలకి రెండువేలే. ఇంకో విషయం నాకు చెప్పకుండా మీ ఫ్రెండ్స్ ఎవర్నీ భోజనాలకి పిలవకండి. నేను బిజీ. సెకండ్ ఫ్లోర్‌లో ఒకావిడ పెయింటింగ్ నేర్పిస్తుందిట. చిన్నప్పటినించి బొమ్మలు వేయడం చాలా సరదా నాకు. ఈవిడకి నెలకి వెయ్యి. మీకు నెలకి ఐదువేలే అదనపు ఖర్చు. మీ శ్రీవల్లి ఎంచక్కా సుకుమార వల్లిగా ఉంటుంది." చిలిపిగా నవ్వింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story